# బ్యాచ్‌లర్

- మీర్ మహిది అలి

దినకరుడు అస్తమించడానికి ఇంకాస్త వ్యవధి ఉంది. గ్రీష్మతాపం తగ్గినట్టూ కనిపిస్తోంది.

సూర్యుని కిరణాల్లో వాడి తగ్గినా, వీస్తున్న గాలిలో వేడి తగ్గలేదు. అర గంట నుండి స్నేహితులిద్దరూ ఆ కాలనీలో తిరుగుతూ ఉన్నారు.

"శశీ! టులెట్ బోర్డు చూడరా" బైక్‌పై వెనక కూర్చున్న ప్రభాకర్ ఉత్సాహంగా అన్నాడు.

శశికర్ ఆ బోర్డును చూసి బైక్‌ను స్లో చేశాడు. బైక్ పార్క్ చేసి బోర్డు వేలాడదీసిన గేటు దగ్గరికి వెళ్ళారు. ప్రభాకర్ బజర్ నొక్కాడు. అది మ్రోగినట్టు ఎలాంటి ధ్వని వినిపించలేదు.

"ప్రభూ కరెంట్ లేనట్టుంది. నీ గొంతు అయితేనే ఇంటిలోపలి వరకూ వెడుతుంది.."

"నేను అరవన్రా! నిన్ననే నా అరుపునకు ఆ ఇంటి కుక్క కరిచినంత పనిచేసింది" ప్రభాకర్ కాస్త భయంగా అన్నాడు.

"రోజూ అలాంటి సీన్లే ఉండవ్‌లే... ప్లీజ్ పిలవరా"

"ఏంటోరా! కొన్నిసార్లు నీతో ఇబ్బందిగా ఉంటుంది"

"ప్లీజ్ నన్నో ఇంటివాడ్ని చేయరా?"

ఇక తప్పదన్నట్టుగా ప్రభాకర్ గొంతు సవరించుకున్నాడు.

"హలో! ఇంట్లో ఎవరండీ" గట్టిగా పిలిచాడు.

ఇల్లు ఊడుస్తున్న శ్రీహితకు వినిపించింది. టులెట్ బోర్డు చూసి వచ్చారేమోనని అనుకుంది. ఆమె తప్ప ఇంట్లో ఎవరు లేకపోవడంతో లోపలి నుండే అంది.

"తర్వాత రండి"

బయట స్నేహితులిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

"ఏమండీ... మేము బిచ్చగాళ్ళం కాదండి. టులెట్ బోర్డు చూసి వచ్చామండీ"

"తర్వాత రండి" లోపలినుండి మళ్ళీ వినిపించింది.

"బయటికి వచ్చి మాట్లాడాలన్న కనీస సంస్కారం లేని వాళ్ళ ఇల్లు మనకెందుకు? పోదాం పద" శశికర్ విసుగ్గా అన్నాడు.

విసుగ్గా అని ఉంటే సరిపోయేది. స్వరాన్ని కూడా పెంచాడు.

వాళ్ళు వెనక్కి తిరిగేంతలో చేతిలో చీపురుతోనే శ్రీహిత బయటికి వచ్చింది.

శశికర్ అలాగే ఆగిపోయాడు. ప్రభాకర్ కంగారుగా ఒక అడుగు వెనక్కి వేశాడు.

"సంస్కారం లేదని ఇందాక అన్నది ఎవరూ?" తీక్షణంగా అంది.

"అప్పుడేదో అన్నానుగానీ మీ వాలకం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది" ఆమె చేతిలోని చీపురును చూస్తూ అన్నాడు.

అప్రయత్నంగా ఆమె చేతిలోంచి చీపురు జారిపోయింది.

"సారీ... మీరామాట అనేసరికి కోపం వచ్చి ఇల్లు ఊడుస్తూనే బయటికి వచ్చాను.. ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేరండి. అందుకే తర్వాత రమ్మన్నాను" సంజాయిషీ ఇస్తున్నట్లుగా అంది.

"ఫర్వాలేదులెండి. టులెట్ బోర్డు చూసి వచ్చాం" ప్రభాకర్ కాస్త ధైర్యం తెచ్చుకుని అన్నాడు.

"ఆ విషయం నాకు అర్థమైంది. మమ్మీ, డాడీ ఇంట్లో లేరు. అందుకనే తర్వాత రమ్మన్నాను"

"తర్వాత అంటే రేపాండీ" ప్రభాకర్ సందేహంగా అడిగాడు.

"గంట తర్వాత రండి. అప్పటికి మమ్మీ వచ్చేస్తుంది" అని వెనక్కి తిరిగింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ" ఆత్రంగా శశికర్ అన్నాడు.

"చెప్పండి" అతని వైపు తిరుగుతూ అంది.

"చిన్న సహాయం చేయాలి"

ఆమె అతన్ని ఎగాదిగా చూసింది.

"ఏంలేదండి. ఇంటి గురించి కొన్ని వివరాలు తెలిస్తే గంట తర్వాత రావాలా? వద్దా? అనేది మాకు అర్థమైపోతుంది"

"అవసరం అనుకుంటే రండీ. లేదంటే మీ ఇష్టం" నిష్కర్షగా అంది.

"అదికాదండి. ఈ ఇల్లు మాకు అందుబాటులో ఉందో లేదో తెలిస్తే ఈ గంట టైం వేస్ట్ చేయకుండా మరో ఇంటి ప్రయత్నం చేసుకుంటాం" ప్రభాకర్ అభ్యర్థిస్తూ అన్నాడు.

ఆమె ఓ క్షణం ఇద్దరినీ పరీక్షగా చూసింది.

ఇద్దరూ జాలిగా ముఖం పెట్టారు.

ఆమె ఎలా భావించిందోగానీ "సరే వివరాలు చెబుతాను" అంది.

"చెప్పండి"

"అద్దెకు ఇచ్చేది మా పక్క పోర్షన్" అంటూ సైగతో ఆవైపు చూపించింది.

ఆ ఇంటికి ఆనుకునే మరో పోర్షన్ కనిపించింది.

"పై డాబాను సగం మేం ఉపయోగించుకుంటాం. సగం అద్దెవాళ్ళు ఉపయోగించుకుంటారు. ఇంకో విషయం డాబాపై లేడీస్ ఉన్నప్పుడు మగవాళ్ళు ఎక్కకూడదు"

"అదంతా తర్వాత విషయమండి. ముందు అద్దె గురించి..." ప్రభాకర్ నసుగుతూ అన్నాడు.

"అద్దె మూడువేలు. అడ్వాన్స్ పదిహేనువేలు" ప్రభాకర్‌ను కోపంగా చూస్తూ అంది.

"మీరు చెప్పిన రెండింటిలో ఏదో ఒకటి కాస్త ఎక్కువున్నట్టుంది" ప్రభాకర్ నవ్వుతూ అన్నాడు.

"మీ ఇద్దరిలో ఇల్లు కావలసిందెవరికి?" కాస్త విసుగ్గా అడిగింది.

"మా వాడికండి" ప్రభాకర్ అన్నాడు.

"మీ ఇద్దరిలో ఒకరు కాస్త ఎక్కువే మాట్లాడుతున్నట్టూ నాకనిపిస్తుంది" కసిగా అంది.

శశికర్‌కు ఆమె స్థితి అర్థమైంది.

"సరేనండి. గంట తర్వాత వస్తాం" ఆత్రంగా అన్నాడు ఆమె నిర్ణయం మార్చుకుంటుందేమోనన్న భయంతో.

ఆమె లోపలికి వెళ్ళబోతూ మళ్ళీ ఆగింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ మీ ఫ్యామిలీలో ఎంతమంది ఉంటారు?" ఆరాతీస్తున్నట్టుగా అంది.

"నలుగురమండి" శశికర్ నమ్రతగా అన్నాడు.

"భార్యాభర్తలు. ఇద్దరు పిల్లలు. ఫర్వాలేదు. చిన్నకుటుంబం" స్వగతంగా అంది.

స్నేహితులిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

"మా వాడికింకా పెళ్ళికాలేదు. అమ్మావాళ్లతో కలిసి..." ప్రభాకర్ మాటలు పూర్తికాలేదు.

ఆమె అసహనంగా అంది.

"మీరు బ్యాచ్‌లరా?"

"అవునండీ" శశికర్ సంశయంగా అన్నాడు.

"గంట తర్వాత కూడా రావాల్సిన అవసరం లేదు. మా ఇల్లు బ్యాచ్‌లర్స్‌కి ఇవ్వం" నిష్కర్షగా అంది.

"అదికాదండీ..." శశికర్ ఏదో చెప్పబోయాడు.

"దయచేసి నా టైం వేస్ట్ చేయకండి"

"మీరు తెలుగు సీరియల్స్ చూస్తారండీ" ప్రభాకర్ ఆత్రంగా అడిగాడు.

ఆమె గంభీరంగా చూసింది.

"ఎందుకు అడుగుతున్నానంటే మావాడు టీవీ సీరియల్స్ రచయిత. ఆ టీవీ, ఈ టీవీ, మా టీవీ, మీటీవీ అన్ని ఛానల్స్‌లో వీడి సీరియల్స్ వస్తుంటాయి. మావాడికి అద్దెకిస్తే రాబోయే ఎపిసోడ్స్‌లో ఏముంటుందో ముందే తెలుసుకోవచ్చండి" గబగబా అనేశాడు.

"నేను తెలుగు ఛానల్స్ అసలే చూడను" తాపీగా అంది ఇంకేమైనా చెప్పేది ఉందా అన్నట్టు చూస్తూ.

ఇంకేం అనాలో అర్ధంకాక స్నేహితులు వెనక్కి తిరిగారు.

'అవసరానికి ఎన్ని అబద్ధాలు చెబుతారు జనాలు' మనసులో అనుకుంటూ శ్రీహిత లోపలికి వచ్చేసింది.

★ ★ ★

రెండోరోజు ఆదివారం కావడంతో కాలేజ్‌కి వెళ్లని శ్రీహిత టీవీలో తెలుగు సీరియల్ చూస్తూ కూర్చుంది. కాలింగ్ బెల్‌కు విసుక్కుంటూ లేచి బయటికి వచ్చింది. గేట్ బయట అందమైన స్త్రీ కనిపించగానే ఆమె విసుగు మాయమైంది.

"చెప్పండి" గేట్ దగ్గరికి వస్తూ సౌమ్యంగా అంది.

"నా పేరు రమ్య అండి. టులెట్ బోర్డు చూసి వచ్చాను"

"లోపలికి రండి"

రమ్య ఆమె వెనకాలే లోపలికి నడిచింది.

"కూర్చోండి... మీ ఫ్యామిలీలో ఎంతమంది ఉంటారండి" ఆమె మెడలోని మంగళసూత్రాన్నే చూస్తూ శ్రీహిత అడిగింది.

"ప్రస్తుతం మావారు ట్రైనింగ్‌లో ఉన్నారు. కాబట్టి ముగ్గురమే ఉంటాం"

"మీరూ ఇద్దరు పిల్లలా?"

రమ్య చిన్నగా నవ్వింది.

"మాది కొత్తగా పెళ్ళయిన ఫ్యామిలీ. పిల్లలు లేరు. అత్తయ్య, మరిది, నేను..."

"మరిది ఏంచేస్తారండి"

"బ్యాంక్‌లో క్యాషియర్"

శ్రీహిత ఆలోచనల్లో పడింది.

"మా మరిది ఎంగేజ్‌మెంట్ కూడా అయింది. మావారు ట్రైనింగ్ నుంచి రాగానే అతని పెళ్ళయిపోతుంది. అప్పటివరకూ మాతోనే ఉంటాడు"

ఆమె ఆలోచనల్ని చదివినట్టు రమ్య అంది.

"పోర్షన్ చూస్తారా?" శ్రీహిత సంతృప్తిగా అంది.

"మీ ప్రక్క పోర్షన్ కదా. మీ ఇంటి లాగే ఉందనుకుంటాను...అద్దె వివరాలు చెబితే..."

"మూడు వేలు రెంట్ అండి. పోర్షన్ పెద్దగా ఉందండి. అడ్వాన్స్ గురించి అంతగా పట్టింపులేదు. పోర్షన్ చూసి నచ్చితే మా మమ్మీతో మాట్లాడుకోండి. పదండి ఇల్లు చూపిస్తాను"

రమ్య అరగంట తర్వాత బయటికి వచ్చింది. ఆటోలో తనింటికి వచ్చేసరికి ఆమె మరిది శశికర్ ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు.

★ ★ ★

ఆరోజు కాలేజ్ నుండి రాగానే శ్రీహితకు అర్థమైంది రమ్య వాళ్ళు పోర్షన్‌లో దిగారని. అరగంట తర్వాత వాళ్లింటికి వెళ్లింది.

"శ్రీహితగారూ రండి" రమ్య





## ఒప్పుకోను

ఎవరు? ఎందుకు? అని ఆలోచిస్తున్నారా? అయితే వినండి. ఈ మాటలంటోంది అందాల భామ లారాదత్తా. 'ఖాకీ' చిత్రంలో స్పెషల్ సాంగ్‌లో కన్పించిన లారా ఇకనుంచి ఇలాంటి ఐటెం నెంబర్ సాంగ్స్‌కి దూరంగా ఉండాలనుకుంటోంది. ఎందుకో ఆమెనే అడిగితే 'అవును. నేను ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక అనేక కారణాలున్నాయి. ఎందుకంటే నాకీ సంవత్సరం చాలా ప్రాజెక్టులున్నాయి. నా సొంత సినిమాలు కూడా ఉన్నాయి. అందుకే ఈ నిర్ణయం. నాకు ఖాళీ ఉంటే ఏదైనా చేయడానికి ఉంటుంది. నా బిజీలో నేనున్నాను' అంటోంది లారా.

నవ్వుతూ ఆహ్వానించింది.

"మీకేమైనా సహాయపడాలని వచ్చానండి"

"మా మరిది అన్నీ సర్దేసి వెళ్లాడండి..."

శ్రీహిత ఆ హాల్‌ను చూడగానే రమ్య మంచి గృహిణి అనుకోకుండా ఉండలేకపోయింది.

"రండి. మా అత్తగారిని పరిచయం చేస్తాను" రమ్య ఆమె చేయి పట్టుకుని కిచెన్‌లోకి తీసుకెళ్లింది.

శ్రీహిత అరగంట అక్కడ గడిపింది. ఆ అరగంటలో ఆ అత్తాకోడళ్ళ అనుబంధం చూసి ముగ్ధురాలైంది. రెండోరోజు ఆమె కాలేజ్‌కు వెడుతుంటే వీధి మలుపులో బైక్‌పై వస్తున్న శశికర్ కనిపించాడు. అతన్ని చూడగానే ఆమె గుర్తుపట్టి చూపులు తిప్పుకుంది. అతను బైక్‌ని ఆమె ప్రక్కన ఆపి "గుడ్‌మార్నింగ్" అన్నాడు.

"మా పోర్షన్ ఖాళీలేదండి" అని అతన్ని దాటి పోయింది.

శశికర్ నవ్వుకున్నాడు. పోర్షన్‌లో దిగింది తనే అని ఆమెకు తెలిస్తే ఎలా రియాక్ట్ అవుతుందో అనుకుంటూ ఇంటికి వచ్చేశాడు.

వారం రోజులు గడిచాయి. ఆ కొన్నిరోజుల్లోనే రమ్య వాళ్ళ కుటుంబం అంటే శ్రీహితకు గౌరవాభిమానాలు పెరిగాయి. వాళ్లతో చనువు కూడా పెరిగింది. ఆ వారం రోజులు శశికర్, శ్రీహితకు ఇంట్లో కనిపించే ప్రయత్నం చేయలేదు. ఆమె కూడా ఏ రోజూ మరిది గురించి రమ్యను అడగలేదు. వదినా మరిదికి ఆ విషయం సంకోచంగానే ఉంది.

శ్రీహితకు నిజం చెప్పాలని రమ్య అనుకుంటూనే ఉన్నా అవకాశం దొరకడంలేదు. చివరికా రోజు ఓ అవకాశం వచ్చింది.

టీవీలో వచ్చే డైలీ తెలుగు సీరియల్ చూస్తూ శ్రీహిత, రమ్య ఇంట్లో కూర్చుంది.

ఆలోచనల్ని రేకెత్తించేగా కథ మలుపు తిరిగి తర్వాత ఎపిసోడ్ కోసం ఆగిపోయింది.

"ఛా! ఇంకో పదినిముషాలు వస్తే ఏం జరిగిందో తెలిసిపోయేది" శ్రీహిత అసహనంగా అంది.

"ఏం జరిగిందో నాకు తెలుసు" రమ్య నవ్వుతూ అంది.

"ఊహించుకుంటున్నావేమో! కాని అక్కా. ఈ కథ మన ఊహల్లో కూడా రానట్టు ఉంటుంది. ప్రతి ఎపిసోడ్ తర్వాత నేనూహించిన దానికి విరుద్ధంగా ఈకథ సాగుతుంది. రచయిత శశికర్ అనుకుంటాను. చాలా బాగా రాశాడు. ఈకథే కాదు. అతనివి ఇంకో రెండు సీరియల్స్ వస్తున్నాయి. అవి కూడా ఇలాగే చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి"

"శశికర్ కథలంటే నీకంత ఇంట్రెస్టా?" రమ్య ఆసక్తిగా అడిగింది.

రమ్యకు ఆనందంగా ఉంది. శ్రీహితకు చెప్పాలనుకుంటున్న నిజానికి ఆ సీరియల్ ఉపోద్ఘాతంగా కనిపించింది.

"నిజం అక్కా. చాలా బాగా రాస్తాడు"

"కథలవరకేగానీ వ్యక్తిగతంగా అతని గురించి ఏమీ తెలియదనుకుంటాను"

"తెలియదు.. అన్నట్టూ ఓ విషయం జ్ఞాపకం వచ్చింది. మీకంటే ముందు ఈ పోర్షన్ గురించి ఇద్దరు అబ్బాయిలు వచ్చారు. అందులో ఒకతను తెలుగు సీరియల్ రైటర్ అని చెప్పినట్టు గుర్తు..."

"పేరేమైనా చెప్పాడా?" నవ్వును బలవంతంగా ఆపుకుంటూ రమ్య అంది.

"అతను చెప్పేది నిజం అనిపించక పేరు అడగలేదు"

"పోర్షన్ అద్దెకివ్వకపోవడానికి కారణం?..అది మీ వ్యక్తిగత విషయం అనుకో.."

"బ్యాచ్‌లర్స్‌కు ఇవ్వకూడదనేది మమ్మీ నిర్ణయం"

"ఆ రైటర్ బ్యాచ్‌లర్ కావడంతో మీరు వద్దనుకున్నారేమో!"

"అవును"

"ఒకవేళ అతను ఏదో అబద్ధం చెప్పి మీ పోర్షన్‌లో చేరి ఉంటే?" ఆత్రంగా అడిగింది.

"ఏదో రోజు నిజం తెలిసేది కదక్కా!" తేలిగ్గా అంది.

"నిజం తెలిస్తే ఖాళీ చేయిస్తారా?"

"అలా జరగదు. ఒకవేళ జరిగినా ఖాళీ చేయిస్తాం"

రమ్య అలా ఎందుకు అడుగుతోందో శ్రీహితకు అర్థం కావడం లేదు.

"మాకు నెలరోజులు గడువిస్తారా?" రమ్య గంభీరంగా అంది. అప్పటికే ఆమె ముఖం పాలిపోయింది.

"గడువు దేనికి?" విస్తుబోతూ శ్రీహిత అంది.

"ఇల్లు ఖాళీ చేయడానికి" నిర్వేదంగా అంది.

"ఇల్లా? ఎవరు ఖాళీ చేయమన్నారు?"

"ఆ పరిస్థితి రాకముందే వెళ్ళిపోవడం మాకు ఉచితంగా ఉంటుంది"

"నువ్వేం అంటున్నావో నాకు అర్థం కావడం లేదక్కా" అయోమయంగా అంది.

"శ్రీహితా! నేనో పెద్ద తప్పుచేశాను. నీతో అబద్ధం చెప్పాను. అత్యవసరంగా మా పాతిల్లు ఖాళీ చేయాల్సి వస్తే మీ ఇంటి కోసం అబద్ధం చెప్పాల్సి వచ్చింది.."

శ్రీహితకు ఆ మాటలు అర్థంకాక అయోమయంగా రమ్యనే చూస్తూండిపోయింది.



"బ్యాచ్‌లర్ అని పోర్షన్ ఇవ్వడానికి నిరాకరించిన ఆ రైటర్ మరెవరో కాదు నాతో ఉంటున్న మా మరిది శశికర్. అతను బ్యాచ్‌లర్ కాదు ఎంగేజ్‌మెంట్ అయిందని నీతో అబద్ధం చెప్పి, నిన్ను మోసం చేసి ఈ ఇల్లు అద్దెకు తీసుకున్నాం. నా పరిస్థితిని సహృదయంతో అర్థం చేసుకుని, క్షమించి మాకు కొద్దిరోజులు గడువివ్వు. ఈలోపు వేరే ఇల్లు చూసుకుంటాం"

శ్రీహిత కొన్ని క్షణాలు స్తబ్దంగా ఉండిపోయింది. తేరుకుని ఏదో చెప్పబోతుంటే ఆమె తల్లి వచ్చింది.

"అమ్మా శ్రీ! నీ ఫ్రెండ్‌నించి ఫోన్ వచ్చింది. త్వరగా వచ్చి మాట్లాడు"

తల్లి రావడంతో ఇంకేం అనలేక ట్రాన్స్‌లో నడుస్తున్నదానిలా తమ ఇంటి వైపు అడుగులు వేసింది.

ఆ తర్వాత రెండుగంటలు శ్రీహిత ఎలాగో గడిపింది. తను మోసపోయానా అన్న భావన ఆమెకు జీర్ణం కావడం లేదు. పోర్షన్‌లో అద్దెకు దిగింది అభిమాన రచయిత శశికర్ అన్న ఉత్సాహాన్నీ, ఏదో తెలియని అహం ఆమెను డామినేట్ చేస్తోంది. అన్యమనస్కంగా డాబాపైకి ఎక్కింది. అక్కడ పూలకుండీలకు నీళ్ళు పోస్తూ శశికర్ కనిపించాడు. అతన్ని చూసి దిగిపోదామనుకుంది.

కానీ ఏదో తెలియని ఉక్రోషం లోపలినుండి తన్నుకువచ్చింది. నేరుగా అతనికి సమీపంగా వెళ్ళింది.

అరగంట క్రితమే రమ్యతో జరిగిన విషయం అతనితో చెప్పింది. ఏదో రోజు నిజం చెప్పక తప్పదు అనే ఆలోచనతో కంగారుపడలేదు. శ్రీహిత ఇల్లు ఖాళీ చేయమంటుందా? లేదా? ఆ విషయం అర్థం చేసుకోలేకపోయాడు. డైరెక్ట్‌గా ఆమెతో మాట్లాడితే బాగుండునని అనిపించింది.

శ్రీహిత రోజూ సాయంత్రం పూలకుండీలకు నీళ్ళు పోయడానికి డాబాపైకి వెళుతుందని అతనికి తెలుసు. అందుకే ఆమె కంటే ముందు తనే వచ్చి ఉన్నాడు.

"గుడీవినింగ్ శ్రీహితగారూ" మందహాసం చేస్తూ అన్నాడేగానీ మనసులో సంకోచంగా ఉంది.

"చదువు సంస్కారం ఉన్నవారు మీకేమని చెప్పాలో నాకు అర్థం కావడంలేదు" ఉక్రోషంగా అంది.

"చదువు సంస్కారం ఉంది కాబట్టి మీరేం చెప్పినా నాకు అర్థం అవుతుంది" నవ్వుతూ అన్నాడు.

"మోసం చేసి మా ఇంటిలో చేరినందుకు మీకు సిగ్గనిపించడం లేదు" కసిగా అంది.

"నేనేం మోసం చేసానండీ" అమాయకంగా అన్నాడు.

అతనికి ఎలా చెప్పాలో ఒక్క క్షణం ఆమెకు అర్థంకాలేదు.

"చూడండి. మా వదిన మీతో ముందే అన్ని విషయాలు చెప్పింది. భర్త ట్రైనింగ్‌లో ఉన్నారు, అత్తయ్య, మరిదితో కలిసి ఉంటున్నానని..."

"మీరు బ్యాచ్‌లర్ అనే విషయం చెప్పలేదు"

"నిజమే! ఆ విషయం చెప్పలేదు. కానీ ఇల్లు ఆమె కోసం తీసుకున్నది. నాకోసం కాదు. మా అన్నయ్య ట్రైనింగ్ నుండి వచ్చాక నేనెలాగో వేరే ఇల్లు చూసుకుంటాను. అప్పటివరకైతే మా కుటుంబానికి మగతోడుగా ఉండాలి కదా!"

ఆమె మౌనంగా ఉండిపోయింది. దాంతో అతనికి కాస్త ధైర్యం వచ్చింది.

"నేను బ్యాచ్‌లర్ కాబట్టి అద్దెకుండే అర్హత నాకు లేదు. కానీ మా అమ్మా, వదినలతో మీకు ప్రాబ్లం లేదు కదా!"

"అది వేరే విషయం. కానీ నిజం చెప్పాలిగా" అంది.

ఈసారి ఆమె గొంతులో కోపం లేదు.

"అద్దెకివ్వరనే భయానికి అలా చెప్పాల్సి వచ్చింది. దయచేసి క్షమించండి"

"నిజం తెలిశాక ఖాళీ చేయిస్తాననే భయం లేదా?"

"మీకు నిజం తెలిసేటప్పటికి బ్యాచ్‌లర్స్ అంటే మీకున్న దురభిప్రాయాన్ని కాస్తైనా దూరం చేయవచ్చని భావించానండి"

ఆమె ఎంత ఉక్రోషంగా అతని సమీపంగా వచ్చిందో, అతనితో మాట్లాడుతూ ఉంటే నెమ్మదిగా ఉక్రోషం కరిగిపోసాగింది. ఏదో ఆలోచిస్తూ వెనక్కి తిరిగింది.

"శ్రీహితగారూ దయచేసి నెలరోజులు గడువివ్వండి" ఆత్రంగా అన్నాడు.

"దేనికి?" అతని వైపు చూడకుండా అంది.

"నేను ఇల్లు మారతానండి"

"మారితే చాలా మంచిదే"

"ఈమాత్రం గడువు ఇచ్చినందుకు కృతజ్ఞతలండి"

"మారితే చాలా మంచిదే అన్నది ఇల్లు గురించి కాదు. బ్యాచ్‌లర్స్ ప్రవర్తన మీలో ఉంటే దాన్ని మార్చుకొమ్మని"

ఆమె చెప్పింది మొదట అర్థం కాలేదు. అర్థం చేసుకునేటప్పటికి ఆమె మెట్ల వైపుపోతోంది.

"ఏవండీ. ఇల్లు ఖాళీ చేయాల్సిన అవసరం లేదు కదండీ" ఆత్రంగా అన్నాడు.

ఆమె ఆగి, వెనక్కి తిరిగి మందహాసం చేసింది.

★

## పొగ

"మీకు చదవడం వచ్చా?" అడిగాడు కండక్టర్.

"వచ్చు" అన్నాడు ప్రయాణికుడు.

"బస్సులో పొగ త్రాగరాదు అని అంత పెద్ద అక్షరాలతో వ్రాసి వుంటే ఎందుకు త్రాగుతున్నావు?"

"నేను పొగ ఎక్కడ త్రాగుతున్నాను. అంతా బయటికే వదిలి వేస్తున్నానుకదా!"

## కష్టాలు

"కాంతం! ఎందుకంత దిగులుగా వున్నావు? నీకు వచ్చిన కష్టమేమిటి?" అడిగాడు భర్త.

"కష్టం వచ్చింది నాకు కాదు, నా అభిమాన సీరియల్‌లో హీరోయిన్ సుబ్బలక్ష్మికి చాలా కష్టాలు వచ్చాయి. ఆమెకి వచ్చిన కష్టాలు తలచుకుని బాధ పడుతున్నానండీ!"

## లెటర్

"అక్కా! డాక్టర్‌ని పెళ్లి చేసుకుని చాలా పెద్ద తప్పు చేసాను" అంది దీప్తి.

"ఏమైందే?" అడిగింది సుబ్బలక్ష్మి.

"నేను ఊరికి వెళ్లినప్పుడల్లా మావారు లెటర్స్ వ్రాస్తారు. ఆ లెటర్ వస్తేనే పెద్ద చిక్కు."

"లెటర్ వస్తే చిక్కు అంటావేమిటి?"

"ఆ వచ్చిన లెటర్ చదవాలంటే మెడికల్ షాప్‌కు పరుగెత్తాల్సి వస్తోంది మరి."

-షేక్ అస్లాం షరీఫ్
(శాంతినగర్)

